సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా అధికారంలో మరోలా సరికాదు

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి - ఉరవకొండ

ప్రజాసమస్యల విషయంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా అధికారంలోకి వచ్చిన తరువాత మరోలా వ్యవహరించడం కూటమి ప్రభుత్వానికి తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ. నల్లప్ప అన్నారు. ఆదివారం ఉరవకొండలోని సిపిఎం కార్యాలయంలో బి. మురళి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శితో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.కృష్ణమూర్తి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఓ. నల్లప్ప మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ఉద్యమాలు చేపట్టి ప్రభుత్వానికి కళ్ళు తెరిపించేలా ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాలు చేపడుదామన్నారు. ప్రతి ఇంటిలో దోపిడీకి ఆస్కారం కలిగించే విధంగా ఆదానీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగించి ప్రజలపై భారం మోపుతున్నారన్నారు. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి గత వైసిపి ప్రభుత్వం స్మార్ట్‌మీటర్లకు ఒప్పందాలు చేసుకుని, అదానీ సంస్థకు టెండర్లను కట్టబెట్టి, భారీ కుంభకోణానికి పాల్పడిందన్నారు. అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి జనసేన పార్టీలు స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి ప్రజలకు మేలు చేస్తామని మాటలు చెప్పి అధికారం చేపట్టిన తరువాత గత ప్రభుత్వ విధానాలనే అనుసరిస్తూ రాష్ట్ర ప్రజలను నిలువునా మోసం చేస్తున్నాయన్నారు. ఆనాడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపునిచ్చిన టిడిపి,జనసేన పార్టీలు, ఈనాడు మీటర్లను బిగించాలని ఆదేశాలు ఇవ్వడం చూస్తుంటే విడ్డూరంగా ఉందన్నారు. వారి స్వార్థ రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. విద్యుత్ భారాలను తగ్గిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే 15,485 కోట్ల రూపాయలు సర్దుబాటు ఛార్జీలను అదనంగా మోపిందని విమర్శించారు. అధిక విద్యుత్ వినియోగించే సమయాలలో అధికరేట్లు నిర్ణయించి వసూలు చేయడం అన్యాయమని, ప్రీపెయిడ్ మీటర్ల వల్ల అందరిపై అధిక భారం పడుతుందని అన్నారు. పాత మీటర్లనే కొనసాగిస్తూ, పాత రీడింగ్ పద్ధతినే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈవిషయాలపై విద్యుత్ వినియోగదారులను సిపిఎం చైతన్యం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, మండల కమిటీ సభ్యులు శీనప్ప, మురళి, వీరాంజనేయులు, సిద్ధప్ప, రవి తదితరులు పాల్గొన్నారు.

కల్తీకి కళ్లెం ఏదీ..?

నామమాత్రపు తనిఖీలు
కానరాని ధరల సూచిక బోర్డులు
ఎరువుల విక్రయాల్లో మోసం

కల్తీ ఎరువులతో రైతులు దగా పడుతున్నారు. వాటి వలన దిగుబడులు కోల్పోతున్నారు. విక్రయించే వారు మాత్రం లాభాలను ఆర్జిస్తున్నారు. పురుగు మందు డబ్బాలపై ఉండే దానికి, విక్రయించే ధరకూ పొంతన ఉండటం లేదు. ఇక బయోకెమికల్స్, ఫర్టిలైజర్స్ ధరలు రైతులకు తెలీవు. దీన్ని అవకాశంగా చేసుకొని వ్యాపారులు మాయాజాలం ప్రదర్శిస్తున్నారు. అందినకాడికి దండుకున్నారు. రైతు పెట్టే పెట్టుబడులలో ఎరువులు, పురుగుమందులకు సింహభాగం ఖర్చు చేస్తుండగా అవే నకిలీ, కల్తీ కావడంతో వారు నష్టపోతున్నారు. వీటికి అడ్డుకట్ట వేయాల్సిన వ్యవసాయ అధికారులు రైతులు ఫిర్యాదు చేస్తే ఆధారాలు కావాలని కోరడం విడ్డూరం. వారు జరిపే తనిఖీలు 'మమ' అనే రీతిలోనే సాగుతుండటం గమనార్హం.

ప్రజాశక్తి-హిందూపురం

రైతులకు నాలుగు రూపాయలు మిగిలాలంటే అదునులో వర్షాలు కురవాలి. పదునులో విత్తు పడాలి. ఆ తరువాత చీడపీడలు ఆశించకుండా సస్యరక్షణ జరగాలి. తుది దిగుబడులు బాగుండి గిట్టుబాటు ధరలు దక్కితేనే పెట్టుబడులు పోను లాభాలు ఆర్జించేది. వీటిలో వర్షాలు పకృతి పరంగా వచ్చేవి. ఆ తరువాత సస్యరక్షణ. చీడ, పీడలు ఆశించకుండా పురుగుల మందులు, పైరుకు బలానికి ఎరువులు వాడాలి. అయితే ఎరువులు, పురుగు మందుల విషయంలో మాయాజాలం నడుస్తోంది. హిందూపురం వ్యవసాయ శాఖ డివిజన్ తో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న పలు ఎరువుల దుకాణాల్లో కల్తీ ఎరువులు, పురుగు మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి. దీనికి నిదర్శనం గత వారం రోజుల క్రితం పట్టణంలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన ఆకస్మిక తనిఖీలే నిదర్శనం. పట్టణంలో గత మంగళవారం ఎడిఎ శివకుమార్, విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ శివన్న, హిందూపురం ఎడిఎ అల్తాఫ్ ఆలీ ఖాన్ బృందంగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. బాలాజీ ట్రేడర్స్, శ్రీ బందావన ట్రేడర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, బాలాజీ ట్రేడర్స్ లో 16.535 మెట్రిక్ టన్నుల 10:26:26, 14:35:14, 15:15:15, అమ్మోనియం సల్ఫేట్, యూరియా ఎరువుల విలువ రూ. 4,86,219 ఎరువులను జప్తు చేశారు. ఈ పాస్ మెషిన్ కు ఎరువుల నిల్వలకు తేడా ఉన్నందున చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు స్టాక్ రిజిస్టర్లు అప్డేట్ చేసుకోవాలని, ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు కొన్న ప్రతి రైతుకు తప్పక బిల్లులు ఇవ్వాలని, స్టాక్ బోర్డు పైన స్టాక్ వివరాలు నమోదు చేయాలని అధికారులు హెచ్చరించారు. అయినప్పటి ఎరువుల దుకాణదారులు మాత్రం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

నామమాత్రపు తనఖీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 950 వరకు ఎరువుల దుకాణాలు ఉన్నాయి. హిందూపురం డివిజన్ వ్యాప్తంగా మొత్తం 23 ఎరువుల దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఒక్క హిందూపురం పట్టణంలో 10 దుకాణాల వరకు ఉన్నాయి. అయితే పలుచోట్ల వ్యాపారులు ఎరువుల్లో కల్తీ చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పేరున్న కంపెనీల నుంచి వచ్చే ఎరువులు, పురుగు మందులు కాకుండా నాశిరకం విక్రయిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. కొనుగోలు సమయంలో కనీసం బిల్లులు కూడా రైతులకు ఇవ్వని పరిస్థితి. ముఖ్యంగా మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ)లో ఎక్కువ కల్తీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. అలాగే యూరియా బస్తాలో నత్రజని 23శాతం ఉండాలి. కానీ కల్తీ కారణంగా అది తగ్గిపోతోందని రైతులు అంటున్నారు. పురుగు మందులకు సంబంధించి డబ్బాపై ఉండే ధరకు దుకాణదారుడు విక్రయించే దానికి పొంతన ఉండటం లేదు. ఈ నేపథ్యంలో ఒకే కంపెనీ పురుగు మందు డబ్బా ధర ఒక్కో దుకాణంలో ఒక్కో విధంగా విధంగా ఉంది. అలానే కొందరు వ్యాపారులు రైతులకు సరుకు కొన్న వెంటనే బిల్లులు ఇవ్వరు. తరువాత వారికి అనుకూలంగా బిల్లులు రాసుకుంటున్నారు. పట్టణంలో ఓ ఎరువుల దుకాణంపై పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతుల నుంచి వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు బృందంగా ఏర్పడి పెద్ద ఎత్తున ప్రయివేట్ ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్నారు. అయితే ఏ ఒక్కరిపై కూడా ఇప్పటి వరకూ కేసు నమోదు చేయలేదు. కేవలం పట్టణంలో రెండు షాపులపై స్టాకు తేడా ఉందని సరుకును జప్తు చేశారు. ఇప్పటికైనా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి రైతులు నష్టపోకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

రైతు ప్రయోజనాలను కాపాడటంలో వ్యవసాయ శాఖ ముందుంటుంది. రైతులు ఎరువులు లేదా పురుగుమందులు కొన్న వెంటనే బిల్లులను తీసుకోవాలి. కల్తీ అనీ, ఎక్కువ ధర తీసుకుంటున్నారని అనుమానం వచ్చినపుడు వెంటనే స్థానిక వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలి.

ఏడీఏ అల్తాఫ్ ఆలీ ఖాన్,
హిందూపురం డివిజన్

ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్‌ఫొటో)

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

ప్రజాశక్తి-శింగనమల

మృతిచెందిన రఘునాథ్‌రెడ్డి

మండల కేంద్రం సమీపంలోని మరువకొమ్మ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండంలోని గుమ్మేపల్లి గ్రామానికి చెందిన రఘునాథ్‌రెడ్డి (52), భార్య సావిత్రి (48) తాడిపత్రి నుంచి గుమ్మేపల్లి గ్రామానికి వెళ్తుండగా శింగనమల క్రాస్ మరువకొమ్మ వద్దకు రాగానే వాహనాన్ని తిప్పారు. దీంతో వెనుక తాడిపత్రి నుంచి అనంతపురానికి వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో రఘునాథ్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన సావిత్రిని అనంతపురం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. వీరికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. కుమారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

రాజకీయ కక్షతోనే ఎంపి మిథున్‌రెడ్డి అరెస్టు

ప్రజాశక్తి-ఉరవకొండ

రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగంగానే ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. లిక్కర్ స్కామ్ పేరుతో వైసిపి లోక్‌సభా పక్షనేత మిథున్‌రెడ్డిని అరెస్టు చేసి రాత్రి కూడా విచారించడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కక్షపూరిత రాజకీయాలు సాగుతున్నాయన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి ప్రజాసేవకే అంకితమైన మిథున్‌రెడ్డిపై అక్రమ కేసును బనాయించి అరెస్టు చేయడం దుర్మార్గపు చర్యన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం రాయలసీమలో అత్యంత ప్రజాదరణ కలిగిన కుటుంబంగా ఉండటంతో ఓర్వలేక చంద్రబాబు ఇలాంటి కుట్రలు చేస్తున్నాడని ఆరోపించారు.

నాయకుల మాస్కులతో కార్మికుల నిరసన

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నాయకులు మాస్కులతో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు, సిఐటియు నాయకులు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెలో భాగంగా కార్మికులు ఆదివారం వినూత్నంగా నిరసన తెలిపారు. ఇందులో భాగంగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ మాస్కులు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర అధ్యక్షులు వెంకటనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్ కార్మికులు తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, చనిపోయిన వారి కుటుంబాల్లో బిడ్డలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ వయో పరిమితి 62ఏళ్లకు పెంచి, రిటైర్మెంట్ బెనిఫిట్ అమలు చేయాలని, అనారోగ్యంతో బాధపడుతున్న కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మిక నాయకత్వంతో చర్చలు చేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. లేనిపక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ సెక్షన్ నాయకులు మల్లికార్జున, రాయుడు, ఓబుళపతి, మురళి, పోతులయ్య, పారిశుధ్య కార్మిక సాకే తిరుమలేశు, బండారి ఎర్రిస్వామి, బత్తల ఆదినారాయణ, నాగేంద్ర, కమల్, కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో సొసైటీ భవనాలు

కూలేందుకు సిద్ధంగా పెద్దవడుగూరు సొసైటీ గోదాము - మరమ్మతులు చేయాలని రైతుల వినతి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

శిథిలావస్థకు చేరుకున్న పెద్దవడుగూరులోని సొసైటీ గోదాము

రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు, సహకార రంగం ద్వారా వ్యవసాయం అభివృద్ధికి చేయూత నిచ్చేందుకు వ్యవసాయ సహకార కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే ఏళ్ల క్రితం నిర్మించిన సొసైటీ కార్యాలయాలు, వ్యవసాయ గోదాములు శిథిలావస్థకు చేరుకున్నాయి. ముఖ్యంగా పెద్దవడుగూరులోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సొసైటీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. మండలంలో పెద్దవడుగూరుతోపాటు అవులాంపల్లి, లక్షుంపల్లి, కిష్టిపాడు రావులుడికి గ్రామాల్లో సొసైటీలు ఉండగా వీటిలో అవులాంపల్లి, లక్షుంపల్లి సొసైటీలను పెద్దవడుగూరులోకి విలీనం చేయగా రావులుడికి సొసైటీని కిష్టిపాడులోకి విలీనం చేసి రెండు సొసైటీలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. కనీసం పాలకవర్గం భవనంలో కూర్చోవడానికి కూడా సరిగ వసతులతోపాటు భవనాలు సరిగలేకపోవడంతో అందులో విధులు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. త్వరలో పాలకవర్గం ఎన్నిక జరగనున్న తరుణంలో ప్రస్తుతం సొసైటీ భవనాల రూపురేఖలను మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పెద్దవడుగూరులో రైతులకు ఉపయుక్తంగా ఉండేలా అప్పట్లో సొసైటీ ప్రక్కనే గోదాము నిర్మించగా అదికాస్త శిథిలమైపోయినది. కాగా సదరు భవనం పునర్నిర్మాణానికి కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. శిథిలమై ఏళ్ల గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని భద్రపరిచుకునేందుకు సరైన గోదాము లేక మండలంలోని రైతులు ఇతరప్రాంతాలకు పంటలను తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా వచ్చే ప్రాథమిక సహకార సంఘం ఎన్నికలు జరిగేలోగా పాలకవర్గ సమావేశం ఏర్పాటుకు అనుకూలంగా భవనాలను పునర్ నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల కొరత..!

ప్రజాశక్తి-గుత్తి

గతేడాది లెక్కల ప్రకారం సరఫరా..
ఈసారి పెరిగిన విద్యార్థుల సంఖ్య
పూర్తి స్థాయిలో అందని కిట్లు

విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం ఆశయం నీరుగారుతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుత్తి మండలంలో గత విద్యా సంవత్సరంలో చదివిన విద్యార్థుల సంఖ్యకు మాత్రమే ఈ విద్యా సంవత్సరానికి విద్యార్థి మిత్ర కిట్లు సరఫరా అయ్యాయి. పాఠశాలలు ప్రారంభించిన రోజే ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.2,279 సొమ్మును వెచ్చించి విద్యార్థి మిత్ర పేరుతో పథకాన్ని అమలు చేస్తోంది. ఒక్కో కిట్‌లో పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్టు, బూట్లు, బ్యాగు ఉంటాయి. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ విద్యార్థి మిత్ర కిట్లతోపాటు వర్క్ పుస్తకాలను ఇవ్వాలి. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలతో కలిపి కిట్లను అందజేయాల్సి ఉంటుంది. అయితే మండలంలో గతేడాది 8142 మంది విద్యార్థులకు కిట్లను పంపిణీ చేశారు. దాదాపు 8500 మంది విద్యార్థులు ఉండగా ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి గత లెక్క ప్రకారం కిట్లను సమగ్ర శిక్షణ అభియాన్ (ఎస్ఎస్ఎ) అధికారులు సరఫరా చేశారు. అయితే ఈ విద్యా సంవత్సరంలో నూతనంగా ఒకటో తరగతికి సంబంధించి 946 మంది విద్యార్థులు అడ్మిషన్ తీసుకున్నారు. వారికి కూడా ఇంకా విద్యార్థి మిత్ర కిట్‌లు రావాల్సి ఉంది. దీంతో మండల విద్యాధికారులు పంపిణీ చేయడంలో ఇబ్బందులు పడ్డారు. పంపిణీ వ్యవహారం తికమకగా తయారైంది. మండల వ్యాప్తంగా 14 ఉన్నత పాఠశాలలు, 56 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. అలాగే ఏపీ ఆదర్శ పాఠశాల, ఏపీ బాలికల గురుకుల పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, ఎపి గిరిజన బాలుర గురుకుల పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సరిపడ విద్యార్థి మిత్ర కిట్లు సరఫరా కాకపోవటంతో విద్యాధికారులు పూర్తిస్థాయిలో విద్యార్థులకు పంపిణీ చేయలేకపోయారు. దీనికితోడు సేవాఘడ్‌లో ఉన్న ఎపి గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో 17 మంది 5వ తరగతి విద్యార్థులు చదువుతున్నారు. ఆ పాఠశాలకు సంబంధించి ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ 50 విద్యార్థి మిత్ర కిట్లను తీసుకెళ్లారు. తిరిగి 25 కిట్‌లను వాపసు పంపించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు కిట్ ల కొరత ఏర్పడింది. మండలంలోని పాఠశాలల సంబంధించి ఇంకా దాదాపు 1300 మంది విద్యార్థులకు కిట్‌లు సరఫరా కావాల్సి ఉంది. పాఠశాలల ప్రారంభమై నెల రోజులు గడిచాయి. పుస్తకాల కొరతతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద కిట్‌లను పంపిణీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

గుత్తి మండల విద్యాధికారి కార్యాలయం

అధికారులకు ఇండెంట్ పంపించాం..

ఆన్‌లైన్ సమస్యతో గత విద్యా సంవత్సరం లెక్క ప్రకారం విద్యార్థి మిత్ర కిట్లు వచ్చాయి. నూతనంగా పాఠశాల్లో ప్రవేశించిన వారి కిట్‌ల కోసం ఎస్ఎస్ఎ అధికారులకు ఇండెంట్ పంపించాం. సరఫరా అయిన వెంటనే విద్యార్థులకు అందజేస్తాం.

వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు చర్యలు

వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ షేక్ రహిమాన్ హుస్సేన్

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వక్ఫ్‌బోర్డు ఇన్స్‌పెక్టర్ షేక్ రహిమాన్ హుస్సేన్

ఉమ్మడి అనంతపురం జిల్లాలోనున్న వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు పటిష్టమైన చర్యలను జిల్లా వక్ఫ్ బోర్డు తీసుకుంటున్నట్లు వక్ఫ్ ఇన్స్‌పెక్టరు షేక్ రహిమాన్ హుస్సేన్ పేర్కొన్నారు. జిల్లాలోనున్న వక్ఫ్ ఆస్తులు, వక్ఫ్‌బోర్డు పరిధిలో జరుగుతున్న కార్యక్రమాలపై ఉమ్మడి జిల్లా వక్ఫ్ ఇన్స్‌పెక్టర్ రహిమాన్ హుస్సేన్ ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

ప్రశ్న : జిల్లాలో బోర్డు పరిధిలో ఎన్ని ప్రార్థనా సంస్థలున్నాయి. ?

జవాబు : ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో మొత్తం 330 ప్రార్థనా మందిరాలున్నాయి. ఇందులో మసీదులు, ఆసురఖానాలు, దర్గాలు ఇలా అన్ని రకాలైన ప్రార్థనా మందిరాలున్నాయి. కొత్త జిల్లాల ప్రకారం చూస్తే 226 అనంతపురం జిల్లాలో ఉండగా 104 సత్యసాయి జిల్లా పరిధిలో ఉన్నాయి. ఇందులో 145 ప్రార్థనా మందిరాలు ఆదాయ వనరు కలిగి ఉండగా తక్కినవి పెద్దగా ఆదాయ వనరుల్లేనివి. ఆయా కమిటీ ఆధ్వర్యంలో వీటి నిర్వహణ జరుగుతూ ఉంటుంది. వక్ఫ్‌బోర్డు వాటి పర్యవేక్షణ జరుపుతూ ఉంటుంది.

ప్ర: వక్ఫ్ పరిధిలో ఆస్తులెన్ని ఉన్నాయి. ?

జ : వక్ఫ్ బోర్డు పరిధిలో మొత్తం 10339 ఎకరాల భూములుండేవి. అయితే జాగీర్దార్ల రద్దు చట్టం తరువాత 7014.32 ఎకరాల భూములు వక్ఫ్ పరిధిలో నుంచి తొలగించబడ్డాయి. ఇవి పోనూ ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 3238.12 ఎకరాల భూములు ఇప్పుడు వక్ఫ్‌బోర్డు పరిధిలోనున్నాయి. ఇందులో కొన్ని ఉపయోగంలో ఉండగా, కొన్ని నిరుపయోగంగానున్న భూములు కూడా ఉన్నాయి.

ప్ర : అన్ని సంస్థల ద్వారా వక్ఫ్‌బోర్డుకు ఏటా వస్తున్న ఆదాయం ఏ మేరకు ఉంటుంది ?

జ : వక్ఫ్‌బోర్డు పరిధిలోనున్న ప్రార్థనా మందిరాల నిర్వహణ ముత్తువల్లిలు, కమిటీల ఆధ్వర్యంలో నడుస్తూ ఉంటాయి. ఈరకంగా చూసినప్పుడు అనంతపురం జిల్లాలో సుమారు ఏడాదికి రూ.10 లక్షల రూపాయల వరకు వక్ఫ్‌బోర్డుకు ఆదాయం సమకూరుతూ ఉంటుంది.

ప్ర:అన్యాక్రాంతమైన వక్ఫ్ ఆస్తుల పరిస్థితి ఏమిటీ ?

జ : ఆక్రమణలకు గురైన ఆస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే అనేక కేసులు న్యాయస్థానంలో నడుస్తున్నాయి. న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

కంటి చూపు లేకుంటే జీవితం అంధకారమే

డాక్టర్ నల్లపాటి తిరుపతినాయుడు

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-పామిడి

కంటి చూపు లేకుంటే ఎవరికైనా జీవితం అంధకారమే అని లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రభుత్వ ఆయూష్ వైద్యాధికారి డాక్టర్ నల్లపాటి తిరుపతి నాయుడు అన్నారు. ఆదివారం స్థానిక భావసార క్షత్రియ కళ్యాణ మండపంలో శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు కంటి వైద్య నిపుణులు డాక్టర్ అబ్దుల్ అబిద్ కంటి సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్లు చాలా సున్నితమైన అవయవాలు అన్నారు. కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా రక్షించుకోవాలన్నారు. దాదాపు 250 మందికి పరీక్షలు చేయగా 70 మందిని ఆపరేషన్లకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పామిడి అధ్యక్షుడు రఘువీర్‌రావు, ప్రధాన కార్యదర్శి పత్రా శ్రీనివాసులు, జిల్లా చైర్‌పర్సన్‌లు డాక్టర్ మురళీకృష్ణ, జయరామ్‌రావు, లయన్స్ క్లబ్ మెంబర్ డాక్టర్ శాంతిప్రియ, సహ కార్యదర్శి రోషన్‌జమీర్, డైరెక్టర్లు ఆర్‌ఎంపీ వైద్యులు గంగ శేఖర్, ముండే షేక్షావలి, తూర్పుంటి ప్రసాద్, సాయికిరణ్, సుహాన్, నరేష్, రాకేష్, శంకర కంటి ఆసుపత్రి ఆర్గనైజింగ్ మేనేజర్ శివప్రకాష్, శివశంకర్, శంకర కంటి ఆసుపత్రి సిబ్బంది, లక్ష్మీ హాస్పిటల్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లాభాల బాటలో గుత్తి పట్టణ బ్యాంకు

ఛైర్మన్ ఎస్.అబ్దుల్‌జిలాని

కార్యక్రమంలో మాట్లాడుతున్న ఛైర్మన్ ఎస్.అబ్దుల్ జిలాని

ప్రజాశక్తి-గుత్తి

ది గుత్తి కోఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ లాభాల బాటలో నడుస్తోందని బ్యాంకు ఛైర్మన్ ఎస్.అబ్దుల్‌జిలాని తెలిపారు. ఆదివారం పట్టణంలోని వసుధ ఫంక్షన్ హాలులో టౌన్‌బ్యాంకు 102వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ బ్యాంకులో వాటాదారులు 4450 మంది ఉన్నారని చెప్పారు. మూలధనం రూ.602.90 లక్షలు ఉందని వివరించారు. రూ.149.76 లక్షలు లాభాలు వచ్చాయన్నారు. త్వరలో గుంతకల్లు, డోన్, కదిరి పట్టణాల్లో శాఖలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఎఫ్ఎస్ డబ్ల్యుఎం కింద రాయదుర్గం పట్టణంలో గుత్తి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు శాఖను ప్రారంభిస్తామన్నారు. గుత్తి, అనంతపురం, పామిడి శాఖలు ప్రగతి పథంలో నడుస్తున్నాయన్నారు. సయ్యద్ షేక్షావలి అనే వ్యక్తి బ్యాంకుపై తప్పుడు ప్రచారం చేస్తుండడంతో అతని సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నట్లు పాలకవర్గం సమావేశంలో తీర్మానం చేశామని చెప్పారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ ఉపాధ్యక్షులు కె.రామ్మోహన్, డైరెక్టర్లు కె.నాగరాజు, ఎం.కృష్ణ, జె.వీరన్న, కె.మధుసూదన్ గుప్తా, సి.నాగరాజు, జి.వెంకటేష్‌బాబు ఎ.మహబూబ్, డి.దాదా, వై.రంగప్రసాద్, ప్రొఫెషనల్ డైరెక్టర్ ఎంవి మహేష్‌కుమార్, బిఒఎం ఛైర్మన్ సుధీర్‌బాబు, సభ్యులు వన్నప్ప, ఎన్.శ్రీనివాస్, సీఈవో ఎస్.మహేశ్వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

డిపిఒపై 'జెసి' దుర్భాషలు బాధాకరం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడును తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అసభ్య పదజాలంతో దుర్భాషలాడటం బాధాకరమని గ్రామ సచివాలయ కార్యదర్శుల యూనియన్ నాయకులు అన్నారు. ఈమేరకు డిపిఒను శనివారం కలిసి పరామర్శించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ డిపిఒపై జెసి ప్రభాకర్‌రెడ్డి దూషించడం ఉద్యోగులందరికీ ఆందోళన కలిగిస్తోందన్నారు. డిపిఒ కిందస్థాయి అధికారులతో కూడా ఎంతో మర్యాదగా ప్రవర్తిస్తూ గ్రామస్థాయిలో ఏ సమస్య వచ్చినా త్వరితగతిన పరిష్కరిస్తున్నారన్నారు. అలాంటి ఆయనపై జెసి అమర్యాదంగా మాట్లాడటం ఏమాత్రం సమంజసంగా లేదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పవన్‌కుమార్, ప్రవీణ్, చరణ్, బాలచంద్రారెడ్డి, మహేంద్రారెడ్డి, ప్రశాంత్, ధ్రువకుమార్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఒకచోట చేరిన పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-శింగనమల

మండలం కేంద్రంలోని జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్‌లో 1994-1999లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒకచోట కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరి యోగ క్షేమాలను మరొకరు అడిగి తెలుసుకున్నారు. ఇందులో భాగంగా అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్న తమ తోటి పూర్వ విద్యార్థులు ఇద్దరు విద్యార్థులు ఎర్రిస్వామి, రాఘవాచారికి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మ్యాథ్స్ టీచర్ నామదేవ్, లక్ష్మీరెడ్డి, తెలుగు పండిట్ పెదయ్య, చంద్రశేఖరశర్మ, సైన్స్ టీచర్ శేషాశర్మ, డ్రాయింగ్ టీచర్ బంగారప్ప, పిఇటి ఆదినారాయణమ్మ, జెడ్పీహెచ్ఎస్ స్కూల్ స్థలదాత ఉస్తిపల్లి సుబ్రహ్మణ్యం కొడుకు నాగరాజు, అటెండర్ వెంకటలక్ష్మి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బిసి నాగేంద్ర, భయపరెడ్డి, కె.బాబా, రఘునాథ్‌రెడ్డి, ఎం.రాము, విశ్వనాథ్‌రెడ్డి, సునీల్‌కుమార్, నాగప్రదీప్‌స్వామి, చంద్రమోహన్, భాస్కర్, నరేంద్రనాథ్‌రెడ్డి, కృష్ణమూర్తి, సుబ్బరాయుడు, తిరుపతయ్య, ఈశ్వరయ్య, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

అతిపెద్ద చదరంగం బోర్డు ఆవిష్కరణ

అతిపెద్ద చదరంగం బోర్డు వద్ద నిర్వాహకులు, చిన్నారులు

ప్రజాశక్తి-అనంతపురం

అంతర్జాతీయ చదరంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని 1వ రోడ్డులో ఉన్న ఎ.1 చెస్ అకాడమీ వారు పోలీస్ ట్రైనింగ్ కళాశాల మైదానంలో 12బై12 అడుగుల చదరంగం బోర్డును ఆవిష్కరించారు. ప్రపంచ చదరంగ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో చదరంగ దినోత్సవాన్ని 'ఎవరీ మూవ్ కౌంట్స్' అనే నినాదంతో మొట్ట మొదటిసారిగా జరుపుకుంటున్నట్లు సీనియర్ చదరంగ శిక్షకుడు, రాయలసీమ మొట్టమొదటి ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్ కుమార్‌నాయుడు తెలిపారు. చదరంగం ఆడటం వల్ల మేధో వికాసానికి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ ఛైర్మన్ బాలరాజు, ప్రెసిడెంట్ శివకుమార్, కోశాధికారి ఇంటూరి కిషోర్‌నాయుడు, సీనియర్ నేషనల్ ఆర్బిటర్ గోవిందరాజులు, ఏ1 చెస్ అకాడమీ శిక్షకులు విజయ్‌కుమార్, మహారాజ్, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడం ఏమనగా 1) మడకశిర నరసింహప్ప తిరుమలరాజు, తండ్రి: లేట్ యం.యన్.నరసింహప్ప, 2) మడకశిర నరసింహప్ప శ్రీనివాసులు, తండ్రి: లేట్ యం.యన్.నరసింహప్ప, అనంతపురం వారు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని మెస్సర్స్ శ్రీ శేఖర్ కన్‌స్ట్రక్షన్స్ Rep. by its పార్ట్‌నర్ బి.శ్రీకాంత్, ఆఫీసు: 2/447, 3వ ఫ్లోర్, 3వ క్రాస్, 3వ రోడ్డు, క్రొత్తవూరు, అనంతపురం స్థిరాస్తి అభివృద్ధి అగ్రిమెంటు తేది 29-09-2022 (12131/2022) అభివృద్ధి చేయుటకు ఆస్తిని వ్రాయించుకొన్నారు. సదరు ఆస్తియందు అపార్టుమెంట్లు నందు ఫ్లాట్ ఇతరులకు అమ్ముకొనుటకు మరియు SBI బ్యాంకు వారి ఋణము కోసము అప్రోచ్ అవుతున్నారు. కావున ఎవరికైన ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి ఎలాంటి తకరార్లు కానీ వున్నచో ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోపల నాకు తెలుపుగోరుచున్నాను. పై తెలిపిన గడువులోపల షెడ్యూలు దాఖలా ఆస్తిని గురించి ఎటువంటి ఆక్షేపణలు రానిచో బ్యాంకు వారు పై వారికి ఋణము మంజూరు చేయుదురని తెల్పడమైనది.

షెడ్యూలు

అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని అనంతపురం ఆర్.డి. మరియు అనంతపురం ఎస్.ఆర్.డి. పరిధిలోని ఆస్తి వివరం.
వార్డు - 4, బ్లాక్ - 3, టి.యస్. నెం. 75/2, ఎ.సి. 0.41.44 లేదా ఎ.సి. 0.43.0, డోర్ నెంబరు పాత: 4/600-1, క్రొత్త: 4-3-121, అసెస్‌మెంట్ నెం. 1001035106, **చెక్కుబంది:** తూర్పు: 30 అ॥ రోడ్డు, పడమర: 20 అ॥ రోడ్డు మరియు 5 అ॥ రోడ్డు విస్తరణ, ఉత్తరం: ఇతరుల ఆస్తి / ఇండ్లు, దక్షిణం: ఇతరుల ఆస్తి / ఇండ్లు, గ్రౌండ్ ఫ్లోర్ నందు ఫ్లాట్ నెంబర్లు: 003, 005, 006, 007, 008, 1st ఫ్లోర్ నందు ఫ్లాటు నెంబర్లు: 102, 104, 107, 108, 112, 113, 2nd ఫ్లోర్ నందు ఫ్లాటు నెంబర్లు: 204, 207, 208, 210, 211, 212, 213. 3rd ఫ్లోర్ నందు ఫ్లాటు నెంబర్లు: 304, 305, 309, 312, 313, 4th ఫ్లోర్ నందు ఫ్లాటు నెంబర్లు: 403, 406, 410, 411

N.R.K.Mohan, Advocate, Anantapur
Cell: 9440787100

విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

ప్రముఖ న్యూరో వైద్యులు జాషువా కాలేబ్

ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థి దశ చాలా కీలకమైందని, విద్యార్థులు ఆశయం తోడుగా క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రముఖ న్యూరో వైద్యులు జాషువా కాలేబ్ సూచించారు. కళ్యాణదుర్గం రోడ్డులోని మధురానగర్ 3వక్రాస్‌లో ఏర్పాటు చేసిన శ్రీ వెంకటేశ్వర ఫిజియోథెరపీ క్లినిక్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజియోథెరపీ విద్యార్థులు కీలకంగా ఉన్నతమైన లక్ష్యంతో ముందుకెళ్లాలని తెలిపారు. బీపీటీ తో ఆపకుండా ఎంపిటిని పూర్తిచేసి నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా విద్యార్థులకు క్రమశిక్షణ కమిట్మెంట్ ఆశయాలకు అనగుణంగా తల్లిదండ్రుల ఆశలకు అనుగుణంగా వ్యవహరించాలని ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని తెలిపారు. ఎస్వీఇఎస్ గ్రూప్ కరస్పాండెంట్ కె.సతీష్‌కుమార్, డైరెక్టర్ రేవంత్‌యాదవ్ మాట్లాడుతూ ఎస్వీఈఎస్ గ్రూప్ ద్వారా విద్యార్థులకు దశాబ్ధకాలంగా నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. సామాన్యులకు ఫిజియోథెరపీ వైద్యాన్ని ఉచితంగా అందించే కాంక్షతో క్లినిక్ ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకూ క్లినిక్‌లో వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీ ఆర్థో డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ పవన్, డాక్టర్ శ్రావణి, షేక్ జవేరియ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

పేదల అభ్యున్నతికి కృషి

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుత్తి

పేదల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. మండలంలోని పాత కొత్తపేటలో ఆదివారం మాజీ సర్పంచి ఎస్.మాబు సాబ్, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు ఎస్.ఇసాక్ సాహెబ్ ఆధ్వర్యంలో 'సూపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గుమ్మనూరుతోపాటు ఆయన తనయుడు గుమ్మనూరు ఈశ్వర్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సామాజిక పింఛన్లు ఒకేసారి పెంచేసి లబ్ధిదారులకు అందజేసిన ఘనత సీఎం నారా చంద్రబాబుకే దక్కుతుందన్నారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంతో పాటు సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ సీఎం చంద్రబాబు ప్రజా మన్నలను పొందుతున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు జిల్లాలో ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, సింగిల్‌విండో అధ్యక్షుడు ఎస్.శివశంకర్, టిడిపి మండల, పట్టణ కన్వీనర్లు ఎస్.బర్దివలి, ఎంకె.చౌదరి, కార్యదర్శులు సాంబశివ, మారుతీప్రసాద్, నాయకులు మోడే శ్రీనివాస్‌యాదవ్, బి.నారాయణస్వామి, కోనంకి కృష్ణ, చిన్నరెడ్డియాదవ్, చికెన్ శీనా, బి.రమేష్, ఎ.గోవర్ధన్‌గౌడ్, కొనకొండ్ల సూరి, ఎం.నాగరాజు, రంగప్ప, కిట్ట యాదవ్, ఎం.రామకృష్ణ, హనుమంతురెడ్డి, కెబి.రామకృష్ణ, కె.సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి చైర్‌పర్సన్ దయామణి

ప్రజాశక్తి-అనంతపురం

నేషనల్ హెల్త్‌మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి ఛైర్‌పర్సన్ దయామణి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఎన్‌జిఒ కార్యాలయంలో ఎపి ఎన్‌హెచ్‌ఎం జెఎసి జిల్లా ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో 22వేల మంది నేషనల్ హెల్త్ మిషన్‌లో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. వారందరూ ఏళ్ళ తరబడి అతి తక్కువ వేతనాలతో ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులుకు మినిమం టైం స్కేలు, ఒకే కేడర్ – ఒకే వేతనం అమలు చేయాలని, సమాన సౌకర్యాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎన్‌హెచ్‌ఎం జెఎసి రాష్ట్ర కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ శిరీషా, ఎపి ఎన్‌జిజిఒ కార్యదర్శి దాసంగం చంద్రమోహన్, ఎన్‌హెచ్‌ఎం జెఎసి జిల్లా గౌరవాధ్యక్షులు శ్రీధర్‌బాబు, అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ జయవర్ధనరెడ్డి, రాజాక్, సత్యనారాయణ, మణి, సూరి, ఖాదర్, ప్రశాంత్, నారాయణస్వామి, సాయిప్రసాద్, సుదర్శన్‌రెడ్డి, మారుతి, నాగరాజు, రషీద్, తిరుమలేశ్వరి, జ్యోతి, సునీత, ప్రభావతమ్మ, కుమార్, తిప్పేస్వామి, రాజేష్, రామలింగం, బసవరాజు, సుంకయ్య తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలి : ఎస్‌టియు

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎన్.రమణారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

బదిలీ పొందిన ఉపాధ్యాయులకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎన్.రమణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని ఎస్‌టియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బదిలీ చేసిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడిలు లేవని జీతాలు ఆలస్యం చేయడం అన్యాయమన్నారు. రెండు నెలలుగా జీతాలు రాకుండా కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. కొత్తగా అప్ గ్రేడ్ అయిన ఉన్నత పాఠశాలల డిడిఒలకు కోడ్‌లు కేటాయించారన్నారు. అయితే ఉపాధ్యాయులకు జీతాలు చేయాలంటే పొజిషన్ ఐడిలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు ఐఆర్ ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలు, ఆర్థిక సెలవుల నగదు బకాయిలు, మెడికల్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు, రాష్ట్ర కౌన్సిలర్ సీనియర్ నాయకులు పివి శివయ్యాఆచారి, ఎస్.సురేష్‌కుమార్, జిల్లా నాయకులు జి.మల్లికార్జున, జి.నారాయణస్వామి, మండల నాయకులు రామకృష్ణ, కె.చంద్రశేఖర్‌స్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాలకు మాజీ సైనిక కుటుంబాల అర్జీలు


ఇంటి పట్టాలకు అర్జీలు సమర్పిస్తున్న మాజీ సైనిక కుటుంబాలు

ప్రజాశక్తి-అనంతపురం

ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ సూచన మేరకు మాజీ సైనికులు, వీరనారుల నుంచి దాదాపు 400 మంది అర్జీలు సమర్పించారు. ఆదివారం అనంతపురంలోని వికె భవన్‌లో మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు కెప్టెన్ దూదేకుల షేకన్న సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా అనేక సమస్యలపై చర్చించడంతోపాటు ఇంటి పట్టాలకు అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు, ట్రెజరర్ టి.తిమ్మారెడ్డి, కుమారస్వామి, శివశంకర్, ఈశ్వరయ్య, నాగిరెడ్డి, రంగారెడ్డి, నాగరాజు, హుస్సేన్, బాలస్వామి, మహమ్మద్ గౌస్, సంజీవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల మైదానంలో జూదం

డ్రోన్ కెమెరాతో పోలీసుల చిత్రీకరణ

పరుగులు తీస్తున్న యువత

పుట్లూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో సాగుతున్న జూదాలపై పోలీసులు డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించారు. పాఠశాలలో సాగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునతోపాటు ఉపాధ్యాయులు సిఐ సత్తిబాబుకు శనివారం ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన సిఐ ఆదివారం సాయంత్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో టెంకాయలు విసిరే పందెం ఆడుతుండగా పోలీసులతో డ్రోన్ కెమెరాల ద్వారా చిత్రీకరించారు. విషయం తెలుసుకున్న యువకులు పరుగులు తీశారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

చెక్కులు అందజేస్తున్న శ్రీనివాసులు

ఉరవకొండ : ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పయ్యావుల శ్రీనివాసులు ఆదివారం బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడపనకల్, కూడేరు, వజ్రకరూరు మండలాలకు చెందిన 29 మందికి 21,90,359 లక్షల చెక్కులు మంజూరైనట్లు తెలిపారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

రాప్తాడులో జలదికి తరలుతున్న పీర్లు

రాప్తాడు : మండల కేంద్రంలో మొహర్రం వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా 19నరాత్రి పెద్ద సరిగెత్తును పురస్కరించుకుని భక్తులు పీర్లస్వాములకు చక్కెర, పానకాల, పూలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం మేళతాళాల మధ్య జల్దికి తరలివెళ్లాయి. సిఐ టి.హర్ష బందోబస్తు ఏర్పాటు చేశారు.

బుక్కరాయసముద్రం : మండల వ్యాప్తంగా గ్రామాల్లో చిన్నపీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా మండలంలోని పసలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన బాజుల్లయ్య, కుళ్లాయి స్వామి పీర్లు యువ కేరింతలు, డప్పు, వాయిద్యాల నడుమ జలదికి తరలాయి. గ్రామపెద్దలు పిట్టు రామకృష్ణారెడ్డి, గుజ్జల ఈరప్ప, చిన్నమారెడ్డి గారి రామచంద్రారెడ్డి, భయపరెడ్డి, తలారి పవన్, పిట్టు సూర్యచంద్రారెడ్డి, చాముండేశ్వరి, సిపి పెద్దన్న, కుళ్లాయిస్వామి, ఎస్.రవి, తలారి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఊరేగుతున్న పీర్లు

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని పొబ్బర్లపల్లి గ్రామంలో పీర్ల పండుగ కనుల విందుగా సాగింది. ఇందులో భాగంగా ఆదివారం పీర్ల దేవుళ్ల ను గ్రామ పురవీధుల్లో తిప్పుతూ జలదికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగకుండా ఎస్ఐ నరేంద్రకుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో సర్పంచు మమతా గంగాధర, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన : వైసిపి

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

గుత్తి : రాష్ట్రంలో సుపరిపాలన కాకుండా అరాచక పాలన కొనసాగుతోందని వైసిపి పట్టణ కన్వీనర్ కె.మధుసూదన్‌రెడ్డి, నాయకులు డి.హుస్సేన్ పీరా, కోనా మురళీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏపీలో అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రెడ్ బుక్ పరిపాలన కొనసాగుతోంది అన్నారు. రాష్ట్రంలో లేని లిక్కర్ కేసును సృష్టించి అనంతపురం రీజినల్ కోఆర్డినేటర్, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేశారన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలను ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కొంటామన్నారు. వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులపై ఎన్ని అక్రమ కేసులు బనాయించిన న్యాయమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వాల్మీకి శివరాం, వి.వరదరాజులు, కెవిరమణ వైసిపి నాయకులు బి.రమేష్‌రెడ్డి, ఎం.రంగస్వామి, జీపు రమణ, వెల్డింగ్ రవుఫ్, కె.రాము, చిన్నపుల్లప్ప, ఖురేషిఅన్వర్, పి.సునీల్ కుమార్, నూర్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం అపహాస్యం : వైసిపి

ఆత్మకూరు : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారాన్ని అడ్డు పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని జిల్లా ఎంపిపిల సంఘం ఉపాధ్యక్షురాలు సుబ్బర హేమలత ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన చంద్రబాబు ప్రజల ఆలోచనలను డైవర్ట్ చేయడానికు కుట్రలకు తెరలేపుతున్నారని ఆరోపించారు. ఇందులో భాగమే ఎంపీ మిథున్‌రెడ్డి కక్షసాధింపు అరెస్టు అన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడమే చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ తీరును కచ్చితంగా ప్రజల్లో ఎండగడతామన్నారు. ప్రస్తుతం మీరు చేస్తున్న విధానాలే.. తిరిగి వర్తిస్తాయని హెచ్చరించారు.

ఉద్యోగ విరమణ వైద్యుడికి సన్మానం

యాడికి : పదవీ విరమణ చేసిన ప్రభుత్వ నేత్ర వైద్యాధికారి గాదిరాజు మధుసూదనరాజును ఆదివారం మండల కేంద్రంలోని కోన రోడ్డులో ఉన్న జెఎం ఫంక్షన్ హాల్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మధుసూదనరాజు మాట్లాడుతూ పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన తాను రాయలసీమలో ప్రజాసేవ చేసి ప్రశంసలు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మధుసూదనరాజు, భార్య సునీతను సత్కరించారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, రాయలచెరువు లయన్స్ క్లబ్ ప్రముఖులు రవిప్రసాద్, కులశేఖర్, లక్ష్మీనారాయణ, హెడ్‌మాస్టర్ సర్వేశ్వరరెడ్డి, నబిరసూల్, సిపిఐ సీనియర్ నాయకులు నీలూరు లక్ష్మయ్య, వైద్యాధికారులు పరమేశ్వర్, ప్రవీణ్, వైద్యసిబ్బంది, బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థికసాయం

ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం టౌన్ : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన కంబదూరు మండలం రాంపురం గ్రామానికి చెందిన వాల్మీకి చిరంజీవికి ఇన్‌ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్, ఉపాధ్యాయుడు బద్దేనాయక్ ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. చిరంజీవి అనంతపురంలోని సన్‌రే ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా విషయం తెలుసుకున్న బద్దేనాయక్ ఆసుపత్రికి చేరుకుని బాధితుడి భార్యకు రూ.25వేలు ఆర్థికసాయం అందించారు. ఆయనతో పాటు ట్రస్టు కోశాధికారి అబ్దుల్, సభ్యులు రవి, సాయినాథ్ ఉన్నారు.

సాంబశివారెడ్డిని కలిసిన వైసిపి రాష్ట్ర కార్యదర్శి

శింగనమల : నూతనంగా నియమితులైన వైసిపి రాష్ట్ర కార్యదర్శి నిట్టూరు రఘునాథ్‌రెడ్డి ఆదివారం అనంతపురంలో ఎన్‌ఆర్‌ఐ వింగ్ కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాంబ శివారెడ్డికి పూలమాల వేసి సన్మానించారు. తనకు పదవి వచ్చేందుకు సహకరించిన సాంబ శివారెడ్డికి రఘునాథ్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ఉంతకల్లు గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం కిమ్స్ సవేరా ఆస్పత్రి సిబ్బంది వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 150 మంది రోగులకు ఉచిత పరీక్షలు చేశారు. వీరిలో 100 మందిని ఆసుపత్రికి రెఫర్ చేసినట్లు జనసేన మండల కన్వీనర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మురళి, లేపాక్షి ఖాదర్‌బాషా, జనసేన పార్టీ రాయదుర్గ ఇన్‌ఛార్జి మంజునాథ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

పామిడి : వర్షం కురవాలని మండల పరిధిలోని నీలూరు గ్రామంలో గ్రామస్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా గ్రామస్తులందరూ కలిసి పెద్దమ్మ, గంగమ్మ, సుంకులమ్మ అమ్మవార్లు, ఆంజనేయస్వామి, ఈశ్వరుడు, నరసింహస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. బిందెల్లో నీరు తీసుకుని పురవీధుల గుండా వెళ్లి అమ్మవార్లకు 101 టెంకాయలు కొట్టారు.

ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలి

పామిడి : కరువు జిల్లా అనంతపురంలో పేదలకు సేవలు అందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్‌డిటి)కి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని ఐఎంఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు వంకరాజు కాలువ వెంకటేష్ డిమాండ్ చేశారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద ఐక్య మాదిగ సమాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన 'సేవ్‌ఆర్‌డిటి' 100 గంటల రిలే నిరాహార దీక్ష ఆదివారం 7వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 26వతేదీ వరకూ రిలే దీక్షలు కొనసాగుతాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఆర్డీటీకి ఎఫ్‌సిఆర్‌ఎను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, కొండాపురం వెంకటరాముడు, రంగనాయకులు, వంకరాజుకాలువ కేశవ, దాసరి నాగభూషణం, మామిడూరు ఓబులపతి, నాగశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

దీక్షలు చేస్తున్న ఐఎంఎస్ నాయకులు

నేరాలు ఘోరాలు

ఇద్దరిపై కేసు

అనంతపురం క్రైం : బ్లూకోల్ట్స్ సిబ్బంది విధులకు ఆటంకం కల్గించిన ఇద్దరిపై కేసు నమోదు చేశామని స్థానిక త్రీ టౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో స్థానిక గుత్తి రోడ్డు సమీపంలో ఓపెన్ డ్రింకింగ్ చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. వెంటనే బ్లూకోల్ట్స్ విధులలో వున్న కానిస్టేబుల్ గంగరాజుచ హోంగార్డ్ రామాంజినేయులు ఆ ప్రదేశానికి వెళ్లారు. బుక్కరాయసముద్రం మండలం ఎల్‌బి నగర్‌కు చెందిన షేక్ షఫీ, షేక్ టిప్పు సుల్తాన్ బహిరంగంగా మద్యం తాగుతుండగా పోలీసులు గమనించారన్నారు. చట్ట వ్యతిరేకమని ఓపెన్ డ్రింకింగ్ చేయరాదని పోలీసులు సూచించారు. పెడచెవిన పెట్టడమే కాకుండా బ్లూకోల్ట్స్ సిబ్బంది విధులకు కలిగించారన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.